సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



తణుకులో కారు బీభత్సం

తణుకు పరిధిలోని జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి బీభత్సం సృష్టించింది. బైక్‌ల పైకి దూసుకెళ్లడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. IIలో ▸



రేషన్ బియ్యం పట్టివేత

నూజివీడులో ఆరు టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. చిన్ని శ్రీనివాస్ బియ్యాన్ని తరలించేందుకు నిల్వ ఉంచగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. IIలో ▸

ప్రగతి సాధకులు.. ఇంజనీర్లు

మానవాళి ప్రగతిలో ఇంజనీర్ల పాత్ర కీలకం. మానవ జీవనాన్ని సులభతరం చేసిన ఆవిష్కరణల రూపకల్పనలో వారి కృషి ఎనలేనిది. నేడు జాతీయ ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. IIలో



న్యూస్‌రీల్

ఏడీజే కోర్టు ఏర్పాటుకు కృషి



ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో ఏడీజే కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పట్టణ న్యాయవాదులకు హామీ ఇచ్చారు. పట్టణానికి చెందిన న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొవ్వూరి అప్పిరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం ఉప ముఖ్యమంత్రి నివాసం వద్ద ఆయనను కలిసి అపరిష్కృతంగా ఉన్న ఏడీజే కోర్టు విషయంపై వినతి పత్రం అందజేశారు. మంత్రి ఈ సందర్భంగా ఫైనాన్స్ సెక్రటరీతో ఫోన్‌లో సంభాషించారు. ఏడీజే కోర్టుకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం ప్రకటించారు. ఈఎస్‌ఐ ఆసుపత్రిని పట్టణంలో ఏర్పాటు చేయాలని న్యాయవాదులు విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ దాసం సునీల్ కుమార్, సీనియర్ న్యాయవాదులు కొల్లి సుబ్రహ్మణ్య శర్మ, గొల్లపూడి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, ఆర్ఎస్‌వీ సోమేశ్వరరావు, ధనమూరి సతీష్, దూలం రత్నశేఖర్, ముళ్ళపూడి శ్రీనివాసరావు, తోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగాలకు 16, 17న ఆన్‌లైన్ పరీక్షలు

భీమవరం (ప్రకాశంచౌక్): ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్, ఈ–డివిజనల్ మేనేజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్‌లో ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్, భీమవరం డివిజన్‌లో ఈ–డివిజనల్ మేనేజర్ మొత్తం రెండు పోస్టులు, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలు, కలెక్టరేట్‌లో ఎన్నికల విధులు నిర్వర్తించడానికి ఎనిమిది డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులను పొరుగు సేవల పద్ధతిలో భర్తీకి గత నెలలో నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్, ఈ–డివిజనల్ పోస్టులకు ఆన్‌లైన్ పరీక్షలు సెప్టెంబర్ 16న, డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులకు ఆన్‌లైన్ పరీక్షలకు 17న భీమవరం బీవీ రాజు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఉద్యోగులకు నేడు ప్రత్యేక స్పందన

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమ గోదావరి జిల్లా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి భీమవరం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో 15న ఉద్యోగుల స్పందన నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల ఫిర్యాదులు, సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు ప్రతి నెలా మూడవ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

దశాబ్దాల కల సాకారం

- కార్పొరేట్‌కు దీటుగా ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల
- రూ. 60 కోట్లతో అధునాతన హంగులతో కూడిన భవనం
- ఈ ఏడాది 150 ఎంబీబీఎస్ సీట్ల భర్తీ
- ఇప్పటికే 120 మంది విద్యార్థులకు అడ్మిషన్లు జారీ
- నేడు లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఏలూరులో నేడు సీఎం జగన్ వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనం

సాక్షిప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటు దాదాపు 40 ఏళ్ల కల. అనేక ప్రభుత్వాలు వచ్చి వెళ్లాయి. ఎన్నో విజ్ఞాపనలు అందజేసినా అవేవీ సాకారం కాలేదు. అయితే ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని కృషితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో దశాబ్దాల కలగా ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు సాకారమైంది. రూ. 60 కోట్ల వ్యయంతో సర్వహంగులతో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో కళాశాల భవనాన్ని నిర్మించారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ఈ మెడికల్ కళాశాలను ప్రారంభించి అనంతరం విద్యార్థులతో మాట్లాడతారు. ఏలూరు నగరంలోని పాతబస్టాండ్ సమీపంలో డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కేవలం రెండేళ్లలోనే మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో కొత్తగా ఐదు మెడికల్ కళాశాలలు నేడు లాంఛనంగా ప్రారంభిస్తున్నారు. విజయనగరంలో ఉదయం 11.40 గంటలకు మెడికల్ కళాశాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారు. అనంతరం వర్చువల్ విధానం ద్వారా ఏలూరు మెడికల్ కళాశాలను ప్రారంభిస్తారు. ఇందుకోసం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.



డిజిటల్ క్లాస్ రూమ్



అధునాతన ప్రయోగశాల

రూ.60 కోట్లతో అధునాతన సౌకర్యాలు

ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలను రూ.60 కోట్లతో నిర్మించారు. భవనాన్ని జీ ప్లస్ టు గా అత్యాధునిక సౌకర్యాలతో, కార్పొరేట్ లుక్‌తో తీర్చిదిద్దారు. ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) పర్యవేక్షణలో వైద్య కళాశాల భవనాన్ని మెగా ఇంజనీరింగ్ కంపెనీ నిర్మించింది. ఏలూరు నగరానికే తలమానికంగా వైద్య కళాశాల భవనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ భవనంలో వైద్య కళాశాల సిద్ధం చేశారు. నిధులకు ఎక్కడా ఆటంకం లేకుండా పూర్తి స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో నిర్మాణం చేపట్టారు.

అత్యాధునిక ల్యాబ్‌ల ఏర్పాటు

ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మూడు అత్యాధునిక ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. హిస్టాలజీ ల్యాబ్, హెమటాలజీ ల్యాబ్, బయో కెమిస్ట్రీ ల్యాబ్‌లను అత్యాధునిక పరికరాలతో నిర్మించారు. ఒక్కో ల్యాబ్‌కు సుమారు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకూ వెచ్చించి మరీ ఏర్పాటు చేశారు. మెడికల్ కాలేజీలో రెండు అత్యాధునిక సౌకర్యాలతో డిజిటల్ లెక్చర్ హాళ్లు, మూడు ల్యాబ్‌లతోపాటు, ఏడు టీచింగ్ రూమ్స్, రెండు సెమినార్ హాళ్లు, ప్రిన్సిపాల్ క్యాబిన్, వైస్ ప్రిన్సిపాల్, స్టాఫ్ రూమ్స్, రెండు మెట్ల దారితోపాటు, లిఫ్ట్ సౌకర్యం, ప్రతి అంతస్తులోనూ వేర్వేరుగా టాయిలెట్స్, స్టాఫ్‌కు ప్రత్యేకంగా టాయిలెట్స్ ఏర్పాటు చేశారు.

ఏలూరుకే తలమానికం



“ఏలూరు జిల్లాకే తలమానికంగా ప్రభుత్వ వైద్యకళాశాల నిలుస్తుంది. వైద్యకళాశాలను మంజూరు చేయాలని కోరిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించి ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రంతో ఆమోదించేలా చర్యలు తీసుకున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ వైద్యశాలను కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం.

– ఆళ్ల నాని, మాజీ మంత్రి, ఏలూరు ఎమ్మెల్యే

కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు



ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అత్యాధునిక సౌకర్యాలు ఏర్పాటు చేశాం. కార్పొరేట్ స్థాయి హంగులతో భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. మూడు ల్యాబ్‌లు ఇప్పటికే మొదటి ఏడాది విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ వైద్య కళాశాలలో 120 మంది వైద్య విద్య అభ్యసిస్తున్నారు. హెల్త్ యూనివర్సిటీ రెండో కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల చేస్తే 150 సీట్లు భర్తీ అవుతాయి. అన్ని సౌకర్యాలతో హాస్టల్ వసతి కల్పించాం.

– డాక్టర్ కేవీవీ విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్, మెడికల్ కళాశాల, ఏలూరు

చంద్రబాబు, పవన్‌ను ప్రజలు నమ్మరు

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



వీరవాసరం: చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ను ప్రజలు నమ్మరని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మండిపడ్డారు. గురువారం వీరవాసరం మండలంలోని మత్స్యపురిలో ఆయన మాట్లాడారు. పేదలకు మేలు జరుగుతుంటే సహించలేని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు తమ అక్కసును ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై చూపిస్తున్నారని అన్నారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి సభల పేరుతో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుని సభ ముగిసిన వెంటనే ఆ దరఖాస్తులను చెత్తకుప్పల్లోకి పడేసేవారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో 98 శాతానికి పైగా హామీలు అమలు చేశారన్నారు. 2014 ఎన్నికలలో చంద్రబాబు 600కు పైగా హామీలు ఇచ్చి ప్రజలను మోసగించారన్నారు.

పవన్ జనసైనికుల్ని వెన్నుపోటు పొడిచారు

వంక రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ



తణుకు టౌన్: చంద్రబాబు అధికారం కోసం తన సొంత మామను వెన్నుపోటు పొడిస్తే.. జనసేన కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళల ఆశయాలకు వెన్నుపోటు పొడుస్తూ పవన్ కళ్యాణ్ అవినీతి కేసులో అరెస్టయిన చంద్రబాబు నాయుడుకు మద్దతు ప్రకటించడం రాజకీయాల్లో అనైతిక విలువలకు పరాకాష్ట అని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. గురువారం ఆయన తణుకులో మాట్లాడుతూ.. వెన్నుపోటుతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబును మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాననడంలో పవన్ కల్యాణ్ ఔచిత్యం బయటపడిందన్నారు. పవన్ కల్యాణ్‌కు చెగువేరా ఆశయాలు లేవని, పుచ్చలపల్లి సుందరయ్య జీవిత చరిత్రలో చిటికెడు ఆశయం కూడా లేదని అర్థమైందన్నారు.

దత్తపుత్రుడి కలలు కల్లలే..

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: పవన్ కల్యాణ్ అధికారంలోకి వస్తామని కలలు కంటున్నాడని, అవి కలలుగానే మిగులుతాయని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమలలో గురువారం మాట్లాడుతూ.. పవన్ టీడీపీ పొత్తుతోనే పోటీ చేస్తాడని మొదటి నుంచి వైఎస్సార్‌సీపీ చెబుతోందని, ఇప్పుడు ఆ ముసుగును ప్యాకేజీ స్టార్ తొలగించాడని అన్నారు.

ధాన్యం సేకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలి



ధాన్యం సేకరణకు సంబంధించి అధికారులతో మాట్లాడుతున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

సాక్షి, భీమవరం: జిల్లాలో సార్వా ధాన్యం సేకరణకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. నవంబరు మొదటి వారంలోనే ప్రారంభించే ధాన్యం కొనుగోలులో జిల్లాలో సార్వా సీజన్‌లో 2.14 లక్షల ఎకరాలలో వరి సాగు చేయగా ప్రస్తుతం ఈ–క్రాప్ బుకింగ్ జరుగుతున్నందున ధాన్యం సేకరణకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని 387 రైతు భరోసా కేంద్రాల పరిధిలో వరి సాగవుతుందని గుర్తించామన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన సామగ్రి సమకూర్చుకుని అవసరమైన గోనె సంచులు తహసీల్దార్ల ఆధీనంలో ఉంచాలని చెప్పారు. జిల్లాకు కోటి గోనె సంచులు అవసరం అవుతాయని వాటిని ముందస్తుగా సమకూర్చుకోవాలన్నారు. అలాగు సేకరించిన ధాన్యం మిల్లులకు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ విధిగా ఏర్పాటు చేయాలన్నారు.

జగన్ ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనలోనే మేలు జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ల కోసం వేచిఉండాల్సి వచ్చేదని, చనిపోయిన వారి స్థానంలో కొత్త పింఛనుదారులను చేర్చేవారని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో అర్హులైన వారందరికి పింఛన్లు అందచేస్తున్నారన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి కొత్తగా 1,702 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం మొత్తం 32,252 మందికి పింఛన్లు అందచేస్తున్నామన్నారు. ఒక్క తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోనే రూ.10 కోట్లు నగదును పింఛన్ల రూపంలో ప్రతి నెలా ఇస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికి లక్షల్లో లబ్ధి చేకూరిందన్నారు. జగన్ ప్రభుత్వంలో ఒక్క రూపాయి లంచం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. త్వరలో జగనన్న ఆరోగ్య కేంద్రాలను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 108 అంబులెన్సు సేవలు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి వినూత్న పథకాలతో పేద ప్రజలకు మేలు చేశారన్నారు. ఉచిత విద్యుత్‌తో వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. తండ్రిని మించిన తనయుడిగా జగన్‌మోహనరెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహనరెడ్డిని మళ్ళీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనం లబ్ధిదారులకు పింఛన్లను అందచేశారు. కార్యక్రమంలో ముత్యాల ఆంజనేయులు, కర్రి భాస్కరరావు, భావన ధాన్యలక్ష్మి, కొట్టు విశాల్, బొడ్డు సాయి, గుండుమోగుల బలుసులు, కొలుకులూరి ధర్మరాజు, బొడ్డు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



కొత్త లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ



నరసాపురంలో తనిఖీకి వచ్చిన మార్కెట్ వాల్యూ ఆడిట్ రిజిస్ట్రార్ పార్వతి

నరసాపురం రూరల్: నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది కక్షిదారులతో మర్యాదగా మెలగడం లేదని ఓ బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్ పార్వతి గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలయ సిబ్బందిపై ఫిర్యాదు మేరకు తనిఖీ చేశామని చెప్పారు. ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన జీవోతో దస్తావేజు లేఖరులతో ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పారు. కార్యాలయ సిబ్బంది ప్రవర్తనపై ఫిర్యాదు చేసిన వ్యక్తి విచారణకు హాజకు కాకపోవడంతో మరోసారి ఆయనకు సమాచారం ఇచ్చి విచారణకు వస్తామని తెలిపారు.

ప్రభుత్వ భవనాలు త్వరితగతిన పూర్తిచేయాలి

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయడంతోపాటు పీఎం కిసాన్ ఆధార్ ఈ–కేవైసీని త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి అన్ని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, వ్యవసాయం, హౌసింగ్, భూ సేకరణ తదితర అంశాలపై అన్ని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు సెప్టెంబరు 15 నాటికి పూర్తయినవి సంబంధిత శాఖల వారికి అందజేయాలని.. పెండింగ్ ఉన్న భవన నిర్మాణాలను కూడా సెప్టెంబరు 30 నాటికి అందజేయాలన్నారు. బహుళ ప్రయోజనాల గోదాములకు సంబంధించి ఫేజ్–1 పెండింగ్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రెవెన్యూకు సంబంధించి స్టోన్ ప్లాంటేషన్, భూహక్కు పత్రాలను కూడా త్వరితగతిన పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వరి చేతికొచ్చే సమయం దగ్గర పడుతున్నందున గోనె సంచులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పీఎం కిసాన్ ఆధార్ ఈ–కేవైసీ ఈ నెల 21 లోపు వ్యవసాయ అసిస్టెంట్లచే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ కు సంబంధించి ఫేజ్–1 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, ఫేజ్–2 ఇళ్ల నిర్మాణాలకు నిర్దిష్ట లక్ష్యాలు రూపొందించుకొని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సెప్టెంబరు చివరి నాటికి ముఖ్యమంత్రి మొదటి దఫా ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించనున్న నేపథ్యంలో పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసి సిద్ధంగా ఉండాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ రామసుందర్ రెడ్డి

సురక్ష క్యాంపులు విజయవంతం చేయాలి

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల విజయవంతానికి అన్ని వర్గాల డాక్టర్ల సహాయ సహకారాలు అవసరమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణకు అవసరమైన వైద్యుల కేటాయింపు, తదితర విషయాలపై ఐఎంఏ సభ్యులు, రెడ్ క్రాస్, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, వైద్య అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యాంపుల నిర్వహణకు ఐఎంఏ నుంచి స్పెషలిస్ట్ డాక్టర్లను కేటాయించాలన్నారు. నెట్ వర్క్ హాస్పిటల్స్, ప్రభుత్వ హాస్పిటల్స్ నుంచి స్పెషలిస్ట్ డాక్టర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఇంటింటి సర్వేకు, క్యాంపులు నిర్వహించే రోజున కొంతమంది నర్సింగ్ స్టాఫ్‌ను కేటాయించాలని నర్సింగ్ కళాశాల యాజమాన్యాలను కోరామని చెప్పారు. రెడ్ క్రాస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని, వారు వృద్ధులకు సహకారం అందించాల్సి ఉంటుందన్నారు. టెలీ కన్సల్టెన్సీకి కొంతమంది స్పెషలిస్ట్ డాక్టర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

పొట్టి శ్రీరాములు మున్సిపల్ గరల్స్ హైస్కూల్, నాచువారిసెంటర్, భీమవరం-1
తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 9912440768

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు తెలపాలి

జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా సలహాలు, సూచనలు అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. గురువారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్– 2024పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, తిరిగి ఏర్పాట్లు, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై నివేదికను సెప్టెంబర్ 23 నాటికి ఏపీ సీఈవో కార్యాలయానికి అందజేయాల్సి ఉందన్నారు. పోలింగ్ స్టేషన్లపై ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 20 నాటికి తెలియజేస్తే వాటిని ప్రతిపాదనలలో చేర్చుతామన్నారు. ఓటర్ కార్డులో స్పష్టంగా లేని ఫొటోల స్థానంలో కొత్తవి అప్‌లోడ్ చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ ప్రచురణ అక్టోబర్ 17న ప్రకటించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు తెలియ జేయవచ్చన్నారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పకడ్బందీగా చేపడుతున్నామని ఒకే కుటుంబంలోని సభ్యులందరూ ఒకే పోలింగ్ బూతులో ఓటు విని యోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రతి ఓటరు రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించకుండా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ వివరించారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జేసీ రామ సుందర్‌రెడ్డి

క్లుప్తంగా

'ప్రత్యేక ఆహ్వానితుల'కు నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందజేసిన ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : రాష్ట్రంలోని వివిధ ప్రముఖ దేవస్థానాలకు ట్రస్ట్ బోర్డు ప్రత్యేక అహ్వానితులుగా నియమితులైన పలువురికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ గురువారం నియామక పత్రాలను అందజేశారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక అహ్వానితులుగా పట్టణానికి చెందిన చెన్నా జనార్దనరావు, మర్నీడి రాఘవరాగిణి, పడమర విప్పర్రుకు చెందిన కోసూరి వెంకటరాజు నియమితులయ్యారు. ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులుగా కొట్టు వెంకటేశ్వరరావు, తాతా శ్రీనివాసరావు నియమితులయ్యారు. అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులుగా నల్లిమిల్లి గాంధీరెడ్డి, గుండుమోగుల బలుసులరావు నియమితులయ్యారు. వీరికి మంత్రి నియామకపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

అనురాధకు ఎడ్యుకేషన్ ఐకాన్ అవార్డు



అనురాధను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అప్పల అనురాధకు బెస్ట్ ఎడ్యుకేషన్ కౌన్సిలర్‌గా 'ఎడ్యుకేషన్ ఐకాన్' అవార్డు దక్కింది. విద్యారంగంలో విశిష్టమైన సేవలు అందిస్తున్నందుకుగాను ఢిల్లీ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ ఐకాన్ అవార్డు-2023ను ఆమెకు ప్రకటించినట్లు కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ చెప్పారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో అనురాధను అభినందించారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ గోదావరి రీజినల్ మేనేజర్ ఆర్.నాగేంద్రబాబు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మావుళ్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం, ఏవో బోనం సురేష్ పాల్గొన్నారు.


పోలవరం ప్రాజెక్టు

ప్రగతి సాధకులు.. ఇంజనీర్లు

● సమాజ నిర్మాణంలో వారే కీలకం ● నేడు జాతీయ ఇంజనీర్ల దినోత్సవం

సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్ : సమాజ పురోభివృద్ధిలో, ప్రపంచ మానవాళి ప్రగతిలో ఇంజనీర్ల పాత్ర కీలకం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజానికి అందిస్తూ ప్రపంచ పురోభివృద్ధిలో వారు విశేష పాత్ర పోషిస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో భూములను సారవంతం చేయడం నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ద్వారా మనిషి దాదాపు అన్ని సౌకర్యాలూ ఇంటినుంచే పొందగలిగేలా అవకాశాలు కల్పించడంలో ఇంజనీర్ల పాత్ర వెలకట్టలేనిది. కృత్రిమ మేథ (ఏఐ) వంటి సాంకేతికత అభివృద్ధిలో ఇంజనీర్ల కృషి ఎనలేనిది.

'సర్'కు.. నివాళిగా..

భారతదేశంలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళిగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 15న ఇంజనీర్స్ డే జరుపుకుంటారు. భారతదేశపు మొట్టమొదటి సివిల్ ఇంజనీర్లలో విశ్వేశ్వరయ్య ఒకరు. ఆయన్ని 1955లో భారతరత్న పురస్కారంతో గౌరవించారు. జాతీయ ఇంజనీర్స్ డే అనేది సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను గౌరవించడంతో పాటు ఇతర ఇంజనీర్లను కూడా గుర్తించేరోజు. దేశంలో తొలిసారిగా 1968లో జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని జరుపుకున్నారు. నేషనల్ ఇంజనీర్స్ డే 2023 థీమ్ 'సుస్థిర భవిష్యత్తు కోసం ఇంజనీరింగ్'గా నిర్ణయించారు.

రైతుల కలలు సాకారం చేసేలా..

కాటన్ నిర్మించిన ధవళేశ్వరం బ్యారేజీ ఒక ఇంజినీరింగ్ అద్భుతం కాగా.. దాని నిర్మాణం ద్వారా తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని లక్షలాది ఎకరాలు సారవంతమయ్యాయి. మెట్ట, ఏజెన్సీ భూములను సైతం సస్యశ్యామలం చేయాలనే ఆలోచనతో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పోలవరం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. దీని ద్వారా ఉభయగోదావరి జిల్లాలతో పాటు కృష్ణాజిల్లాలోని మెట్ట ప్రాంత భూములను సైతం సుభిక్షం చేసే దిశగా ఆయన అడుగులు వేశారు. నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతులమీదుగా అది సాకారమయ్యే దిశగా ముందుకు సాగుతోంది. త్వరలోనే ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసుకొని ప్రజలకు అంకితమయ్యేందుకు సిద్ధమవుతోంది.

ఆదర్శప్రాయులు వీణం వీరన్న

సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాలుగేళ్ల పాటు ఆయన వెన్నంటి ఉన్న వీణం వీరన్న నేటి ఇంజనీర్లకు ఆదర్శప్రాయులు. ఇంజనీరింగ్ బాధ్యతలను కాటన్ వెన్నంటి ఉండి వీరన్న నెరవేర్చి కాటన్ అంత ఖ్యాతిని పొందారు. ఆయన ఇంజనీరింగ్ సేవలను కొనియాడుతూ పెంటపాడులో ఒక ఆడిటోరియం నిర్మించడంతో పాటు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఇంజనీర్ల పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.

ఇంజనీరింగ్ విద్యకు మణిహారంగా ఉమ్మడి పశ్చిమగోదావరి


ఏపీ నిట్ భవనాలు


నూజివీడు ట్రిపుల్‌ఐటీలోని అకడమిక్ భవనం

ఇంజనీరింగ్ విద్యలో మణిహారంగా నిలిచే జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రభుత్వ కళాశాలలు పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో కొలువై ఉండటం విశేషం. వాటిలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఎన్ఐటీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) ఒకటి కాగా, మరోటి ఏలూరు జిల్లా నూజివీడులోని ట్రిపుల్ ఐటీ. రాష్ట్రానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేసే నిట్ కాలేజీ తాడేపల్లిగూడెంలో కొలువై ఉండటం విశేషం. జేఈఈలో ర్యాంకు సాధించడం ద్వారా ఇక్కడ సీటు పొందగలుగుతారు. దాదాపు దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన విద్యార్థులూ ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత జాతీయ విద్యా సంస్థలను కేటాయించే క్రమంలో తాడేపల్లిగూడెం పట్టణానికి నిట్‌ను కేంద్రం మంజూరు చేయగా, అనతికాలంలోనే ఉద్యోగాల కల్పనలో ప్రఖ్యాతిగాంచిన తిరుచ్చి నిట్ తర్వాతి స్థానంలో ఈ కళాశాల నిలిచింది. 2020-21 సంవత్సరంలో దక్షిణ భారతదేశంలో ఉన్నత విద్యాసంస్థగా ఏపీ నిట్ నిలిచింది. జాతీయస్థాయిలో సామర్థ్యం కలిగిన విద్యార్థులను ఇంజనీర్లుగా తీర్చిదిద్దడంలో ఈ విద్యాసంస్థ విశేష కృషి చేస్తోంది.

ఆరేళ్ల విద్య.. పూర్తి ఉచితంగా..

ఏలూరు జిల్లా నూజివీడులోని ట్రిపుల్‌ఐటీ ఇంజినీరింగ్ విద్యలో మణిహారంగా నిలుస్తోంది. ఇక్కడ ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. 2008లో దీనిని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం పూర్తిగా ఉచిత విద్యను అందజేస్తోంది. ఇందులో మొదటి రెండేళ్లు ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ), తరువాత నాలుగేళ్లు ఇంజినీరింగ్ విద్యను విద్యార్థులు అభ్యసిస్తారు. ఏటా 1100 మంది విద్యార్థులు ఇక్కడ ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని బయటికి వెళుతున్నారు.

సమాజ పురోగతికి ఇంజనీర్లు దోహదం



సమాజ పురోగతికి ఇంజనీర్లు దోహదం చేస్తున్నారు. భావి ఇంజనీర్లు సమాజ ప్రగతికి తమవంతు పాత్ర పోషించాలి. దేశ సమగ్ర అభివృద్ధికి కృషిచేయాలి.
– డాక్టర్ పి.దినేష్ శంకరరెడ్డి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ఏపీ నిట్

ఆధునిక అంశాలను అన్వేషించాలి



భావి ఇంజనీర్లు నచ్చిన ఇంజనీరింగ్ విభాగంలో ఆధునిక అంశాలను అన్వేషించాలి. దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించాలి. ప్రస్తుత ఇంజనీరింగ్‌లో ఆధునిక కోర్సులైన కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటివి అద్భుతాలు సృష్టిస్తున్నాయి. విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య అనుసంధాన ప్రక్రియకు పరస్పర ఆధారిత సాంకేతిక పరిజ్ఞానం వారధిగా నిలవాలి.
– డాక్టర్ వి.సందీప్, ఈఈఈ విభాగాధిపతి, ఏపీ నిట్

దేశాభివృద్ధిలో ఇంజనీరింగ్ విద్యే కీలకం



దేశాభివృద్ధిలో ఇంజనీరింగ్ విద్య అత్యంత కీలకం. రహదారులు, వంతెనలు, బహుళ అంతస్తుల భవనాలు తదితర నిర్మాణాల్లో సివిల్ ఇంజనీరింగ్ పాత్ర ప్రధానం. మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశం గర్వించే గొప్ప ఇంజనీర్. దేశానికి సివిల్ ఇంజనీర్ల అవసరం ఎంతో ఉంది.
– ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, డైరెక్టర్, నూజివీడు ట్రిపుల్‌ఐటీ

జెడ్పీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా స్టాన్లీ బాబు



ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ స్టాండింగ్ కౌన్సిల్‌గా వెంపటి స్టాన్లీ బాబు నియమితులయ్యారు. ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఈ మేరకు గురువారం ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. నగరంలోని విద్యానగర్‌కు చెందిన స్టాన్లీ బాబు 30 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉన్నారు. సీనియర్ న్యాయవాదిగా తాను చేసిన సేవలకు గుర్తింపుగా జెడ్పీ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించడంపై సంతోషం వ్యక్తం చేశారు. తనకు ఈ అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పరిషత్‌లోని అంశాలలో న్యాయపరమైన వివాదాల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. నగర డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, ఏపీపీలు ఆచంట వెంకటేశ్వరరావు, డీవీ రామాంజనేయులు, సీహెచ్ రాజేంద్రప్రసాద్, పలువురు న్యాయవాదులు స్టాన్లీ బాబుకు అభినందనలు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నూజివీడు: పట్టణంలోని శిలువ గట్టు సమీపంలోని గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన ఆరు టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, సివిల్ సప్లయ్స్ అధికారులు పట్టివేశారు. పట్టణానికి చెందిన చిన్ని శ్రీనివాస్ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి తరలించేందుకు అక్రమంగా నిల్వ ఉంచగా, అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏలూరు సీఐ విల్సన్, సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ జీ వెంకటేశ్వరరావు, వీఆర్వో పీ రాజబాబు బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటల సమయంలో గోడౌన్‌పై దాడి చేసి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తెల్లసంచుల్లో నిల్వ ఉంచిన ఈ రేషన్ బియ్యం బస్తాలను లెక్కించగా ఆరు టన్నులుగా తేలింది. వీటిని గోడౌన్ నుంచి తరలించి రేషన్ డీలర్ కస్టోడియన్‌లో ఉంచారు. ఈ ఘటనలో శ్రీనివాస్‌పై 6(ఏ) కేసు నమోదు చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశారు.

● గడపగడపకు సంక్షేమం



నరసాపురం రూరల్ : నరసాపురం 4వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



పెంటపాడు : అలంపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

యాదవ మహాసభ జాతీయ సదస్సుకు తరలిరండి



సదస్సు ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : తిరుపతిలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహిస్తున్న అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ సదస్సుకు తరలిరావాలని జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు చిదరబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉక్కుసూరి గోపాలకృష్ణ కోరారు. అమీనాపేట ఏటిగట్టులోని సంఘ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సదస్సుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని యాదవుల రాజకీయ భవిష్యత్తు కార్యాచరణపై సదస్సులో చర్చిస్తారన్నారు. 16న యాదవ ప్రతినిధుల సభ, 17న వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్న యాదవ ప్రముఖులతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, అయోధ్యలోని రామ జన్మ భూమి వివాదం పరిష్కరించిన తరహాలో మధురలోని శ్రీకృష్ణ జన్మభూమి వివాదాన్ని పరిష్కరించి కృష్ణ మందిరాన్ని నిర్మించాలని కోరారు. యాదవుల సామాజిక ఆర్థిక, విద్య, ఉద్యోగ ప్రగతి కోసం రాజస్థాన్ ప్రభుత్వం తరహాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి మండళ్లు ఏర్పాటు చేయాని, భారత సైన్యంలో అహిర్ రెజిమెంట్‌ను పునరుద్ధరించాలని, కులగణన వెంటనే చేపట్టాలని కోరారు. తిరుమల తిరుపతిలో యాదవ వసతి గృహాన్ని నిర్మించాలని, టీటీడీ పాలకమండలిలో యాదవులకు శాశ్వత సభ్యత్వం కల్పించాలని, తిరుమల-తిరుపతి కూడలిలో శ్రీవారి ఆలయం నిర్మించిన యాదవ రాజుల జ్ఞాపకార్థం వారి శిలావిగ్రహాలను ప్రతిష్ఠించి, వారి చరిత్ర మ్యూజియంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారపు బుజ్జి, కోశాధికారి గొర్ల రామారావు, నగర అధ్యక్షులు బొట్టా అజయ్, కోశాధికారి భోగా రాజేష్, రాష్ట్ర యువజన కార్యదర్శి మల్లిపూడి రాజు, నాయకులు చిట్టిబోయిన సాయిబాబు, కట్టా ఏసుబాబు, పుల్లగోర చిరంజీవి పాల్గొన్నారు.

బైక్‌లపైకి దూసుకెళ్లిన కారు

● పెయింటర్ మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు
● తణుకు హైవేపై శర్మిష్ట సెంటర్ వద్ద ఘటన


తణుకు హైవే వద్ద ప్రమాదం దృశ్యం


చదలవాడ ప్రేమ్‌కుమార్ మృతదేహం



చికిత్స పొందుతున్న ఆకుల బుల్లబ్బాయి, కర్రి సత్యనారాయణరెడ్డి

తణుకు: పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి మోటారు సైకిళ్లపైకి దూసుకెళ్లిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక శర్మిష్ట సెంటర్‌లో గురువారం ఈ సంఘటన చోటు చేసుకుంది. ప్రమాదం సమయంలో కారును మహిళ నడుపుతున్నట్లు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామానికి చెందిన చదలవాడ ప్రేమ్‌కుమార్ (24), ఆకుల బుల్లబ్బాయి, మార్లపూడి రాజు పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం వీరు మోటారు సైకిల్‌పై పెయింటింగ్ పనులు నిమిత్తం తణుకు బయలుదేరారు. స్థానిక శర్మిష్ట సెంటర్ వద్దకు వచ్చేసరికి రోడ్డు దాటుతున్న వీరి మోటారు సైకిల్‌ను విజయవాడ నుంచి రాజోలు వెళుతున్న కారు ఢీకొట్టింది. ఇదే సమయంలో మరో మోపెడ్‌పై రోడ్డు దాటుతున్న ఉండ్రాజవరం మండలం కె.సావరం గ్రామానికి చెందిన కర్రి సత్యనారాయణరెడ్డిని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చదలవాడ ప్రేమ్‌కుమార్ సంఘటనా స్థలంలోనే మృతి చెందిగా ఆకుల బుల్లబ్బాయి, కర్రి సత్యనారాయణరెడ్డి తీవ్రంగా గాయపడగా మార్లపూడి రాజుకు స్వల్పగాయాలయ్యాయి. బుల్లబ్బాయి పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన విజయవాడకు చెందిన వర్ధినీడి స్వాతిసుబ్బలక్ష్మిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16న రెజ్లింగ్ జిల్లా జట్ల ఎంపికలు

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న జిల్లా స్థాయి రెజ్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శులు జాన్సన్, డీబీ రాజేంద్రప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలుర, బాలిక జట్ల కోసం నిర్వహించే ఎంపికలకు అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. అండర్-14లో పాల్గొనేవారు జనవరి 1, 2010 తరువాత, అండర్-17లో పాల్గొనే వారు జనవరి 1, 2007 తరువాత జన్మించి వారై ఉండాలన్నారు. ఈ ఎంపికలకు వచ్చే వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థుల ఎంట్రీఫామ్, మిడ్‌డే మీల్ ఎక్విడెన్స్, గేమ్స్ ఎంట్రీ ఫామ్‌ను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు 70137 81688, 97011 77004 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

మత ప్రచార కరపత్రాల దగ్ధం కేసులో ఐదుగురి అరెస్టు

అత్తిలి: ఆరవల్లిలో క్రైస్తవ మత ప్రచారం నిర్వహిస్తున్న మతబోధకులను అడ్డుకుని, కరపత్రాలను దగ్ధం చేసిన ఘటనలో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు గురువారం చెప్పారు. ఈ నెల 13న సాయంత్రం ఆరవల్లిలో నర్సాపురం ప్రాంతాలకు చెందిన మతబోధకులు క్రైస్తవ మత ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచిపెడుతుండగా స్థానికులు అడ్డుకున్నారు. మత ప్రచార కరపత్రాలను, పుస్తకాలను దహనం చేశారు. దీనిపై క్రైస్తవులు గురువారం ఆరవల్లి గ్రామానికి పెద్ద సంఖ్యలో చేరుకుని నిరసన చేపట్టారు. దీంతో తాడేపల్లిగూడెం డీఎస్పీ శరత్‌రాజ్ కుమార్, సీఐ ఆంజనేయులు ఆరవల్లి వచ్చి క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో మాట్లాడి నిరసన విరమింపచేశారు. ఆరవల్లి వీఆర్వో దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన వెలగల గోపాలరెడ్డి, వెలగల పుల్లారెడ్డి, వెలగల వెంకటరెడ్డి, వెలగల సురేంద్రరెడ్డి, వెలమరెడ్డి దిలీప్ అజిత్‌కుమార్‌లపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు. అత్తిలి ఎస్సై వి.రాంబాబు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట హిందూ సంఘాల ఆందోళన

ఆరవల్లిలో హిందూదేవుళ్లను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ, వీహెచ్‌పీ హిందూ సంఘాలవారు గురువారం రాత్రి పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఆరవల్లిలో క్రైస్తవ మత కరపత్రాలను దగ్ధం కేసులో ఐదుగురిని అరెస్టు చేయడంపై వారు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. తమ గ్రామం వచ్చి తమ దేవుడు గొప్పవాడని, తమ మతంలో చేరాలని అంటూ హిందూ దేవుళ్లను అవమానించారని గ్రామానికి చెందిన పప్పులక్ష్మి, వి.పద్మజ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధులకు ఆరోగ్య భద్రత



నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, తదితరులు

పెంటపాడు: వైఎస్సార్ పెన్షన్ కానుకతో వృద్ధులకు ఆర్థిక భద్రత లభిస్తుందని పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, దర్శిపర్రు ఎంపీటీసీ సభ్యులు తోట నిరీక్షణరావులు పేర్కొన్నారు. పెంటపాడులో గురువారం పెంటపాడులో 87 పింఛన్లు, దర్శిపర్రులో 18 పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూర్యకళ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుండుమోగుల మునీంద్ర, పెంటపాడు ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి, బాబి, బర్ల జయరాం బాబు, తాడేపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- అలంపురంలో గడపగడపకు ప్రభుత్వం



అలంపురంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం పెంటపాడు మండలం అలంపురంలో గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి జగనన్న సంక్షేమ పథకాలను ప్రథకాలను ప్రజలకు వివరించారు. పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఆయన స్థానం ప్రజల గుండెల్లో సుస్థిరంగా ఉందన్నారు. నవరత్నాలు, పేదలకు ఇళ్లు, నాడు- నేడు, ఆసరా, చేయూత ఇలా ప్రతి పథకంలో ప్రతి కులానికి, పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు జగనన్న ఇస్తుంటే ఆయనపై వ్యతిరేకత ఎలా వస్తుందని ప్రశ్నించారు. ప్రతిపక్షాలైన టీడీపీ, జనసేన పార్టీలు అధికారం కోసం వైఎస్సార్ సీపీపై అభండాలు వేయటం తప్ప ఆయనను ప్రజల నుండి ఎవరూ వేరుచేయలేరన్నారు. ప్రశ్నించేందుకు పార్టీ పెట్టానని చెప్పిన పవన్ కల్యాణ్ పీకల్లోతు అవినీతిలో రిమాండ్‌లో ఉన్న చంద్రబాబుతోనే జీవితాంతం ఉంటానని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఒక మంచి ప్రభుత్వం తమకు వచ్చినందుకు మరలా ఆయనకు కొనసాగించేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. గత నాలుగేళ్లలో చంద్రబాబులా కాకుండా జగనన్న ఇచ్చిన హామీలు అమలు చేయడం ఆయన రాష్ట్ర ప్రజలపై ఉన్న చిత్తశుద్ధిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రజలిచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేసి వందల కోట్లు దోచేశాడన్నారు. కోట్ల రూపాయల చెల్లించి ఢిల్లీ నుంచి తీసుకొచ్చిన లాయర్ వల్ల కూడా చంద్రబాబు బయటకు రాలేడన్నారు. పవన్ కల్యాణ్ జనసేన పార్టీ పెట్టింది తన కోసం కాకుండా కార్యకర్తలను చంద్రబాబుకు తాకట్టు పెట్టాడన్నారు. వీరమహిళలు, జనసైనికులు చంద్రబాబుకు ఊడిగం కోసం పనిచేయాలా అని మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రశ్నించారు. కాపు యువతను చంద్రబాబుకు తాకట్టు పెట్టి వారి భవిష్యత్‌ను బుగ్గి చేస్తున్నాడన్నారు. దీనిపై కాపు యువత ఆలోచించుకోవాలన్నారు. 90 లక్షల మంది మహిళల ఉసురుపోసుకొన్న చంద్రబాబుకు పాపం చుట్టుకొని జైలు పాలయ్యాడన్నారు. జనసేనకు ఓట్లు వేస్తే టీడీపీకీ వేసినట్లు ప్రజలు గుర్తించాలన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని తెలిపారు. సీఎం జగన్‌కు వస్తున్న ఆధరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎం జగన్ గెలవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొలనువాడ దత్తుడు, సూరిబాబు, తాతారావు, మురళి, ఎంపీపీ దాసరి హైమావతి, కై గాల శ్రీనివాస్, పలు గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి కొట్టును కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

తాడేపల్లిగూడెం అర్బన్ : ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను గురువారం తాడేపల్లిగూడెంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి బొకేను అందచేశారు. అనంతరం ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, చెన్నా జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ విజన్‌తోనే పరిశోధనల విశ్లేషణ

సాక్షి, భీమవరం: బృహత్తర పరిశోధనల విశ్లేషణ కంప్యూటర్ విజన్ సహాయంతోనే జరుగుతుందని డిజిట్ఎంజి సీఈఓ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి భరణి కుమార్ చెప్పారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం కంప్యూటర్ విజన్‌పై రెండు రోజుల వర్క్ షాప్‌ను ఆయన ప్రారంభించారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



వైఎస్సార్ బీమా చెక్కును బాధితురాలి కుటుంబానికి అందిస్తున్న పార్టీ నాయకులు అంజిరెడ్డి, భాస్కరరెడ్డి తదితరులు

పెంటపాడు: ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పార్టీ సీనియర్ నాయకులు నల్లమిల్లి విజయానందరెడ్డి, పార్టీ యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డిలు పేర్కొన్నారు. పెంటపాడు సచివాలయం-3కు చెందిన తాడి దానిరెడ్డి పొలంలో కరెంట్ షాక్‌తో మృతి చెందారు. వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా ఆ కుటుంబానికి బీమా సొమ్ము రూ. 5 లక్షలు భార్య తాడి సోమాలమ్మకు అందజేశారు. ఆమెకు వితంతు ఫించన్ కోసం దరఖాస్తు చేయగా నూతన పింఛన్ కూడా గురువారం అందించారు. తనను ప్రభుత్వం ఆదుకొన్నందుకుగాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు స్థానిక నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు -3 సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కర్రి పృధ్వీ, ముత్యప్రసాద్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు



మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): తాడేపల్లిగూడెం మండలం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) అండర్ -14, 17 బాల బాలికల సెలక్షన్స్ పట్టణంలో గురువారం బాలికల ఉన్నత పాఠశాలలో జరిగాయి. విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు. తొమ్మిది విభాగాల్లో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నీకాయిట్, యోగా, షెటిల్, బాల్ బాడ్మింటన్, అథ్లెటిక్స్‌కు సెలక్షన్స్ నిర్వహించారు. మండలంలోని 19 స్కూల్స్ నుంచి 560 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మండల విద్యాశాఖాధికారి జ్యోతి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌లు సెలక్షన్స్‌ను ప్రారంభించారు. పోటీల్లో విజేతలు త్వరలో నిర్వహించే నియోజకవర్గస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ ఏ.ఈశ్వర్ శ్రీనివాస్, జిల్లా గౌరవాధ్యక్షుడు చింతకాయల సత్యనారాయణ, జోన్ కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు కె.నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, శ్యామలాంబ, ఉమామహేశ్వరి, చంద్రశేఖర్, శ్రీనివాస్, అమర్‌నాథ్, నాగార్జున్, హరనాధరెడ్డి, సుబద్ర, సరిత, సుభానిలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పొత్తును ప్రజలు అంగీకరించరు

- ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు టౌన్: రాజమండ్రి జైల్లో ఉన్న చంద్రబాబును జనసేన అధినేత పవన్ కల్యాణ్ కలవడంపై ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పవన్ చంద్రబాబు దత్తపుత్రుడు అంటుంటారు కథా..దత్తపుత్రుడు అనే పేరుకు ఇవాళ సార్ధకత చేకూర్చారని వ్యాఖ్యానించారు. మనస్సులో ఎంతో అభిమానంతో పవన్ కల్యాణ్ అభిమానులు, వీర మహిళలు ఒక సోషలిజం పాలన తెస్తాడు అనుకుని స్వచ్ఛందంగా పవన్ కళ్యాణ్ వెనునిలబడ్డారని అయితే రూ. 241 కోట్ల స్కాంకు కారణమైన చంద్రబాబుకు మద్దతు పలకడం దారుణమన్నారు. దీనికి ఆపార్టీ నాయకులే కాకుండా అతని అభిమానులు కూడా ఆలోచనలో పడ్డారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కు ప్రజలే సరైన బుద్ధి చెబుతారని తెలిపారు. స్కీమ్‌లు ద్వారా స్కామ్‌లు చేసి రిమాండ్ ఖైదీగా రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న చంద్రబాబుకి ప్రజల్లో సానుభూతి లేదన్నారు. చంద్రబాబు కేసులో తీర్పు చెప్పిన జడ్జిపై తెలుగుదేశం కార్యకర్తలు విమర్శలు చేయడం సరికాదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. తండ్రిని మించిన తనయుడిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు.

ప్రజా సేవే ధ్యేయంగా పాలన



బీమా సౌకర్యం, పెన్షన్‌లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తెన్నేటి జగజ్జీవన్

తాడేపల్లిగూడెం (టీటీసీ): ప్రజా సేవే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని స్థానిక 13వ వార్డు ఇంచార్జి, జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు తెన్నేటి జగజ్జీవన్ అన్నారు. వైఎస్సార్ సీపీ గృహసారథుల కుటుంబాలకు భరోసా కల్పించేందుకు జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన బీమా సౌకర్యం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సచివాలయం వద్ద గురువారం గృహసారథులకు బీమా సౌకర్యం కల్పించారు. పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జగజ్జీవన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటారని తెలిపారు. కుల, మత, వర్గాలను చూడకుండా అవినీతి లేని పారదర్శక పరిపాలన చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని కొనియాడారు. సఅనంతరం వార్డులో నూతనంగా మంజూరు చేసిన 6 గురికి వృద్ధాప్యం, వితంతు పెన్షన్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్స్ ధర్నాల శేఖర్, ఎర్రంశెట్టి కృష్ణవేణి, అడ్మిన్ ఎస్.సూర్యచంద్రం, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎల్ఐసీ కుటుంబ పెన్షన్ పెంపుదలపై హర్షం

తాడేపల్లిగూడెం (టీటీసీ): జీవిత బీమా కుటుంబ (ఎల్ఐసీ) పెన్షన్ పెంపుదలపై అఖిల భారత బీమా పెన్షనర్ల సంఘం రాజమండ్రి డివిజన్ సంయుక్త కార్యదర్శి గరికపాటి బాపయ్య శర్మ హర్షం ప్రకటించారు. పట్టణంలో గురువారం ఆయన మాట్లాడుతూ చిరకాలంగా అపరిష్కృతంగా ఉన్న పెన్షన్ పెంపు డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం గెజిట్ ప్రకటన ద్వారా పరిష్కరించిందని తెలిపారు. గడిచిన నాలుగు సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న ఎల్ఐసీ ఫ్యామిలీ పెన్షన్ 15 శాతం నుంచి 30 శాతంకు పెంచడం వల్ల సంస్థలోని సీనియర్ పెన్షనర్ల కుటుంబాలకు ప్రయోజనం కలిగిందన్నారు. అదే విధంగా ప్రభుత్వ రంగ సాధారణ బీమా సంస్థల కుటుంబాల పెన్షన్ కూడా పెంపుదలకు కేంద్రం సమ్మతి, అనుమతి ఇవ్వాలని బాపయ్య శర్మ డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరూ హిందీభాష నేర్చుకోవాలి



బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ వేడుకలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం దత్

అత్తిలి: దేశ ఐకమత్యం కోసం హిందీ చాలా దోహదపడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ చెప్పారు. అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం 'హిందీ దివస్'ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎం దత్ మాట్లాడుతూ భారత జాతీయోద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష ఆనాడు దోహదపడిందన్నారు. ప్రతి ఒక్కరూ హిందీని నేర్చుకోవాలని కోరారు. హిందీ మన రాజభాష అని, 14 సెప్టెంబరు 1950 నుంచి మన జాతీయ భాషగా ఏర్పడిందన్నారు. సాహితీ సంఘ సభ్యులు, హిందీ ఉపాధ్యాయుడు ఎంవీవీఎన్ బలరామ మూర్తి మాట్లాడుతూ దేశ సమగ్రతను, ఐకమత్యాన్ని సాధించడానికి హిందీభాష తోడ్పడుతుందన్నారు. నేటి కాలంలో హిందీ మరుగున పడుటవల్ల హిందీని ఎక్కువ మంది నేర్చుకోవడం లేదని, విద్యార్థులు హిందీని నేర్చుకోవడం ద్వారా భవిష్యత్‌లో రాణిస్తారని అన్నారు. హిందీలో గత ఏడాది 6 నుంచి 9వ తరగతులలో అధిక మార్కులు సాధించిన వారికి, మౌఖిక, రచనల్లో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సాహితీ సంఘ కార్యదర్శి ఎస్ పురుషోత్తం, సిహెచ్ బాలసుబ్రహ్మణ్యం, హర్షద్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హిందీ భాషను అభ్యసించాలి

తణుకు టౌన్: మన జాతీయ భాష హిందీని ప్రతి ఒక్కరూ అభ్యసించడం ద్వారా దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందవచ్చని పైడిపర్రు జిల్లా పరిషత్ హెచ్ఎం ఎం.ఏడుకొండలు చెప్పారు. గురువారం జాతీయ హిందీ భాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హిందీ బాషను ప్రతి ఒక్కరు అభ్యసించాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మూర్తి, రామలక్ష్మీ, మాట్లాడారు. ఉపాధ్యాయులు యం ఏసు కృప, జయరాజు, ప్రసాద్, ధనలక్ష్మీ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందీపై ప్రతి ఒక్కరు ఆసక్తి కనపర్చాలి

తాడేపల్లిగూడెం (టీటీసీ): హిందీ దేశ రాజభాష అని తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల హిందీ అధ్యాపకులు జె.వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ హిందీ భాషా దినోత్సవం సందర్భంగా గురువారం జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ఇంచార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ ప్రజలందరికి అమోదయోగ్యమైన భాష కావాలనే సదుద్దేశ్యంతో అప్పటి ప్రముఖులు హిందీని జాతీయ భాషగా ఆమోదించినట్లు చెప్పారు. నేడు దేశంలో అధికంగా హిందీ మాట్లాడుతున్నారని తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ నాగార్జున మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటం జరిగే రోజుల్లో హిందీని దేశ భాషగా ప్రకటించారని వెల్లడించారు. హిందీపై ప్రతి ఒక్కరు ఆసక్తి కనపర్చాలని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.తిరుపతయ్య, మాణిక్యం రాజా, నాగ భవాని, సీతామహాలక్ష్మి, శిరీష, ఎం.నిర్మల, సీహెచ్ లక్ష్మి, యూసఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఆర్‌జీలో ఘనంగా హిందీభాషా దినోత్సవం

పెంటపాడు: దేశంలో అత్యధికంగా మాట్లాడే రాజభాష అయిన హిందీ ఆవశ్యకతను విద్యార్థులు గుర్తుంచుకోవాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. హిందీభాషా దినోత్సవం పురస్కరించుకొని గురువారం స్థానిక కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హిందీ విభాగం అధ్యక్షురాలు ఆర్. రమాదేవి, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ విక్టర్ ప్రేమ్‌సాగర్, జె. విజయబాబు, రచయిత గోపాలయ్య, పి. రామచంద్రుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.